# జీవన తరంగాలు

రాధి

రాధిక చేతిలో కాయితాలు గాలికి రెపరెపలాడాయి. శూన్యంలోంచి దృష్టిని మళ్ళించి, మళ్ళీ ఒకసారి ఆ ఉత్తరాన్ని చదివింది, మధ్యమధ్య కళ్లు ఒత్తుకుంటూ.

* * *

ఒకరోజు నువ్వు మా యింటికి వచ్చావు. అత్తవారింటినుంచి వచ్చిన కొత్తకోడలి వనీ. ఎన్నెన్నో కబుర్లు చెప్పి, చెప్పించుకుని నవ్వుకుందా మనీ, అమ్మావాళ్ళను వదలివెళ్ళి అప్పటికి నాలుగునెలలే అయినా నాలుగుయుగాల వియోగాన్ని భరించి, సంతోషంగా — కేరింతలు కొడుతూ వచ్చాను పుట్టింటికి.

గదిలో ఒంటరిగా కూర్చునివున్న నాదగ్గరకు వచ్చి పలకరించావు. నవ్వాను; ఏవో కబుర్లు చెప్పాను. కానీ అవి నువ్వూహించిన విధంగా లేవనీ, నీకు సంతృప్తి కలిగించలేదనీ నాకు తెలుసు. కానీ, నాస్థితి నీకు తెలియదు రాధా! కొన్ని క్షణాల నిశబ్దంతర్వాత "నువ్వు నాలా మారిపోయావు నీలూ," అన్నావు నాకళ్ళల్లోకి చూస్తూ

కిటికీలోంచి ఎండిపోయిన పూల మొక్కను చూస్తున్న నేను ఉలిక్కిపడ్డాను. "మారా నంటావా? బాధ్యతలు నెత్తిన పడలేదూ!" అన్నాను ప్రయత్నపూర్వకంగా నవ్వుతూ. నువ్వు మాట్లాడలేదు. ఎప్పుడూ నవ్వుతూ గలగలా పారే సెలయేరులా తిరిగిన మన కాలేజీ జీవితం గుర్తు తెచ్చుకున్నావేమో:దూ!

తర్వాత పావుగంటకే నువ్వు వెళ్ళిపోయావు. 'వెళ్ళొస్తా' నని నువ్వంటే గులాబీ మొక్కమీదనుంచి దృష్టి మరల్చుకోకుండనే మంచి దని తల ఆడించాను. బరువుగా విడిచిన నీ నిట్టూర్పు నాకు నీ దిగులును తెలియచెప్పింది. ఆ క్షణాన నిన్ను వేలుపట్టుకుని ఆపి — నీ ఒళ్లో తలపెట్టి తనివితీరా ఏడవా లనుకున్నాను. కానీ ఏదో చెయ్యలేకపోయాను. నాదృష్టి అంతా మ్రోడయిన గులాబిమీదే వుంది. 'పచ్చగా, కళకళలాడుతూ కన్నులపండువగా పూలు పూసే దీ తెల్ల గులాబి ఎరువు వెయ్యక, నీళ్ళు పొయ్యక నిర్లక్ష్యం చెయ్యటంతో ఎండి తలవాల్చే

సింది. సమయానికి తగిన పోషణ జరగక పోతే — తర్వాత దానికోసం ఎంతకృషి చేసినా చిగురించదు; ప్చ్!' పరిపరివిధాల పోతున్న ఆలోచనలతో కూర్చుండి పోయిన నా భుజంమీద సున్నితస్పర్శ సోకటంతో తలఎత్తి చూశాను కాదంబరి. మరుక్షణం నా కళ్ళు నీటితో నిండి పోయాయి. 'అమ్మయ్యో' అంటూ కాదంబరి హృదయంమీద వాలిపోయాను.

"పిచ్చీ. ఏమిటిది? అమ్మ చూస్తే ఏమను కుంటారు. ఊరుకో." మృదువుగా నా తల నిమురుతూ కళ్లు తుడిచింది కాదంబరి

"కృష్ణ నెలా మర్చిపోయేదే." బావురు మన్నాను. 'ఇన్నాళ్ళు కంటితోనైనా చూసి సంతృప్తి పడేదాన్ని. ఇప్పుడా అదృష్టం కూడా లేకుండా చేశాడు దైవం."


"హుష్! ఊరుకో; పద్దు వస్తోంది" కాదంబరి హెచ్చరించింది.

తనకు దూరంగా జరిగి దోసిట్లో గడ్డం ఆన్చి శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాను

"అక్కా, లైటు వెయ్యనా?" పద్మజ వస్తూనే అడిగింది.

"వద్దు! అక్కకు తలనెప్పిగా వుందిట." కాదంబరి జవాబిచ్చింది.

మా ఇద్దరి ప్రక్కనే కూర్చుంది పద్మజ. ఉన్నట్టుండి, "అక్కా మాస్టరు గారి అమ్మ ఎలా ఏడుస్తున్నారో! నాకూ చాలా ఏడుపు వచ్చిందే. నన్ను దగ్గరకు తీసుకుని 'నీ కింకా మాస్టారు లేరమ్మా' అంది ఏడుస్తూ. అంటే ఆయన మళ్ళీ రారా అక్కా! మొన్న ప్రైవేటునుంచి వస్తుంటే 'ఈ ఆదివారంతో నీకు ట్యూషను గొడవ వదిలిపోతుందికదూ.' అన్నారు 'సెలవులైనా మీరు రోజూ రండి మాస్టారూ; లేకపోతే నాకు తోచదు' అన్నాను. నన్ను దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుని వీపు నిమురుతూ చాలా సేపు ఊరికెనే కూర్చున్నారు. ఉన్నట్టుండి 'అక్కఎలావుంది' పద్దూ అన్నారు. 'బానే వుందండీ! ఎంచక్కా బావతో కేరమ్సు ఆడుకుంటుంది యిప్పుడు' అనగానే ఎందుకనో ఏడిచారు. 'ఎందుకేడుస్తున్నారు మాస్టారూ' అంటే, 'ఏడుపు కాదు పద్దూ! తన వంటని విషాదచ్ఛాయలు తల్చుకుంటే కలిగే ఆనందం' అన్నారు. నా కేమిటో అర్థం కాలేదు. 'వెళ్తాను మాస్టారూ' అంటే సరే నని తల వూపారు. 'బాగా చదువు పద్దూ! పరీక్షల్లో ఫస్టుగా రావాలి' అన్నారు వచ్చేస్తుంటే. ఇవ్వాళ ఇంగ్లీషు పేపరు చూపిద్దామని వెళ్తే ఆవిడా — మాస్టారుగారి అమ్మట — మన అత్తయ్యా ఏడుస్తున్నారు నాన్న నన్నక్కడ వుండవద్దని పంపించేశారు. ఎందుకనక్కా! మాస్టారివాళ నిన్ను చూట్టానికి మనింటికి వస్తానన్నారుగా. వీళ్ళందరూ అక్కడికెందుకు వెళ్ళారు?" పద్దు పుల్‌స్టాప్ లేకుండా మాట్లాడేస్తోంది.




"ఇవాళ వస్తానన్నారా?" అప్రయత్నంగా అడిగాను.

"అవునక్కా; నిన్ను చూడాలని వుందన్నారు. 'రేపు పొద్దున ఆలయానికి యిటే వెళ్తుందిగా మాస్టారు! ఇవ్వాళ అక్కతో చెప్తాను. రేపు మీ యింటికి వస్తుంది' అన్నాను. 'వద్దమ్మా నేనే వస్తాను' అని. 'ఇంకా ఏముందని వెళ్తున్నావు వీలీ ఆలయానికి?' అన్నా రక్కా."

నా మనసు తపించిపోయింది. పుట్టెడు దుఃఖంతో నిగ్రహించుకోలేక కాదంబరి చెయ్యి పట్టుకున్నాను గట్టిగా. చివరిక్షణానకూడా నన్నే కలవరించాడు. కానీ నే నేం చేశాను. తను జీవితమంతా అసంతృప్తితో ఆవేదనతో గడిపేస్తుంటే. ఆయనతో షికార్లు తిరిగాను. వెన్నెల్లో రైడుకు వెళ్ళాను. బ్రతికి వున్నాళ్ళూ పన్నెత్తి పలకరించలేదు. ఇవ్వాళ పిలిచినా పలకని దూరానికి తను తరలిపోయాక, అతనికోసం ఏడిచే, నా పాపానికి నిష్కృతి వుందంటావా?

ఇంతకూ ఈ కృష్ణ ఎవరని ఆశ్చర్యపోతున్నావు కదూ! ఒకదానివెనక ఒకటిగా, అల కావల మరొక అలగా జీవన స్రవంతి తెచ్చే అనుభవపు తరంగాలలో — నాకు కృష్ణతో పరిచయం ఒక తరంగంలాటిది. ఆ తరంగాల మలుపుల్లో అనుభూతుల నెదుర్కొంటూ — జీవన రాగం సృష్టించే అనుభవాల నెదుర్కోలేక తలవాల్చిన, తీగలు తెగిన వీణనై పోయాను రాధా!

మొదటిసారిగా కృష్ణను వేణుగోపాల స్వామి ఆలయంలోనే చూశాను. మన ముందరం పి. యు. సీ. రాశాం. పరీక్షల హడావుడిలో గంట నొక క్షణంగా గడిపిన నాకు ఆరోజు గంట ఒక యుగమై పోయింది. ఏం తోచక గోళ్ళు గిల్లుకుంటూ తోటలో తిరుగుతుంటే అమ్మ పిలిచింది. "పరీక్షల హడావుడి అయిపోయిందిగా. భాగీరధమ్మగారు రావటం లేదుట ఈపూట నాతో కోవెలదాకా రారాదూ" అంది నవ్వి.

అదీ ఒక కాలక్షేపమే నమకుని సరే నన్నాను. త్వరత్వరగా తయారై వచ్చిన నన్ను చూసి నాన్నగారు ఫక్కున నవ్వారు.

"ఎందు కలా నవ్వుతారు?" రెండవ జడకు రిబ్బను అల్లుకుంటూ కొంచెం కోపంగా అడిగాను పాలవెన్నెలలాంటి లైటుకాంతిలో కట్టుకున్న షిఫాన్ చీర మెరిసిపోతోంది.

"గుడికి యిలా వెళ్ళకూడదమ్మా! చూడు అమ్మ ఎలా వుందో." అన్నాడు నాన్న.

"ఎలా వెళ్ళాలేంటి?" విసుగ్గా అన్నాను.

"ఇలారా చెప్తాను" అంటూ అమ్మ నన్ను లాక్కు వెళ్ళింది. షిఫాన్ చీర విప్పించి పట్టుపరికిణీ — జార్జెట్ ఓణీ వేయించింది. రెండుజడలు విప్పి, ఒక్కటిగా అల్లి, చివర కుచ్చులు వేసింది. నన్నునినడుముకు ఒడ్డాణం — అంతా అయినాక అద్దంలో నా ప్రతిబింబం చూసుకుంటే నాకే ఆశ్చర్య మేసింది. 'నేనేనా' అని.


పట్టులంగా రెపరెపలమధ్య — గాజుల గలగలతో నడిచివస్తున్న నన్ను చూసి నాన్న నవ్వారు నిండుగా. 'నా పెళ్ళిప్పుడు మీ అమ్మ అచ్చం యిలాగే వుండేది, లక్ష్మీదేవిలా,' అన్నారు.

అమ్మ కళ్ళతోనే వారించింది నాన్నను 'చాల్లెండి ఏమి టా మాటలు!'

చటుక్కున ఎప్పుడూ అనేమాట గుర్తుకువచ్చి అనేశాను 'అమ్మ ఏం కట్టుకున్నా బానేవుంటుంది నాన్నా' అని.

'సరేలె, ఇక పదండి,' హెచ్చరించింది అమ్మ.

నాన్నగారుకూడా వచ్చారు మాతో. ముగ్గురం కబుర్లు చెప్పుకుంటూ నడిచి ఆలయం చేరుకున్నాం. చీకటి పడిందేమో! జనం క్రమంగా పల్చబడుతున్నారు. ఆలయంచుట్టూ ప్రదక్షిణ చేయడం మొదలుపెట్టాం. చుట్టూ చూసుకుంటూ, జారిపోతున్న పమిట కొంగును విసుగుతో భుజం నిండుగా కప్పుకుని అడుగు వేయబోయి ఆగిపోయాను, ఆలయ ప్రాంగణంలో విశాల ఆవరణలో గర్భగుడి వెనకప్రక్క వున్న పారిజాతం చెట్టుక్రింద తలక్రింద చేయి పెట్టుకుని పడుకునివున్న ఆ యువకుడిని చూడగానే కళ్ళు తిప్పి నాన్న



వైపు చూశాము. నాన్నకూడా అటే చూస్తున్నారు.

'ఏమి టలా చూస్తున్నారేం? కదలండి' మూడో ప్రదక్షిణకూడా పూర్తి చేసి మళ్ళీ వెనక్కు వచ్చి పిల్చింది. అమ్మ. అతను తలత్రిప్పి చూశాడు. చివాల్న లేచికూర్చున్నాడు. నాన్నవెంట త్వరత్వరగా అడుగులు వేస్తూ ఆలయంలోకి వచ్చాము.

పూజ అయినాక పూజారి శఠగోపురం పెడుతుండగా 'అమ్మాయిని దీవించండి' అంది అమ్మ.

ఆయన నవ్వారు. 'అమ్మాయి కేమండీ! రత్నాలగర్భ! ఆ అదృష్టవంతు డెవరోకానీ.' నాకు సిగ్గేసింది. తెల్లని పాలరాతి రూపంలో వెన్నెల లాగా మెరిసిపోతూ అఖండజ్యోతి కాంతి తోటి పవిత్రంగా కనిపిస్తున్న వల్లన య్యేమో నమస్కారం చేసి, బైటికి వచ్చాను నా కళ్ళు అప్రయత్నంగానే అతన్ని వెతికినాయి. కాని ఎక్కడా కనిపించలేదు.

తర్వాత ఒకరోజు మ్యాట్నీకి వెళ్ళి అందులో పాటను 'హమ్' చేసుకుంటూ వస్తున్న నేను గుమ్మందగ్గర టక్కున ఆగిపోయాను. హాలులో ఫొటోలను చూస్తూ నిలబడ్డ అతను అడుగుల సవ్వడికి వెనక్కుతిరిగి 'నమస్తే' అన్నాడు.

'నమస్తే కూర్చోండి' అన్నాను.

సోఫా పట్టుకుని అలాగే నిలబడ్డాడు. లోపలికి వెళ్ళాలో, అక్కడే కూర్చోవాలో తోచలేదు నాకు. ఇంతలో నాన్న కర్టెను తొలగించుకుని వచ్చారు చేతిలో కాఫీకప్పుతో.

'అప్పుడే అయిపోయిందా పిక్చరు ? ఈయన మిస్టర్ మోహనకృష్ణ. యూని వర్సిటీలో కెమిస్ట్రీ లెక్చరరు మా పెద్ద మ్మాయి పీలిమ' అంటూ పరిచయం చేశారు.

లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకుని హాలులోకి వచ్చేసరికి అతను లేడు. 'మోహనకృష్ణ' చక్కనిపేరు అనుకుని నవ్వుకున్నాను.

కాలం గడిచిపోయింది. కాలేజీలు తెరిచారు. ఈ మధ్యలో ఒక్కసారైనా అతను కనిపించలేదు. రెండుమూడు సార్లు కోవెలలో వెతికాను అతనికోసం. కాదంబరీ నేనూ బియ్యేలో చేరాం. నువ్వు మెడిసన్‌లో చేరటానికి వైజాగ్ వెళ్ళి పోయావు. తరుచూ ఉత్తరాలు రాసు కుంటున్నా నీకి సంగతి రాయలేక పోయాను.


పరీక్షలు మొదలైనాయని గదిలో కూర్చుని 'సీజర్' డ్రామా చదువుకుంటు న్నాను. నాన్న హాలులోంచి అమ్మతో ఏదో అంటున్నారు. 'పాపం ! చాలా పెద్దదెబ్బలు తగిలాయిట. చూద్దామని వెళ్ళాను. అంతకుముందే వాళ్ళ ఊరి నుంచి ఎవరో మనిషి వచ్చి తీసుకు వెళ్ళారట. ఎలావుందో యేమిటో పాపం!'

'ఎవరు నాన్నా ?' కుతూహలంగా అడిగాను. 'అతనేనమ్మా ! మోహన కృష్ణ. కోవెలదగ్గర యాక్సిడెంటు అయిం దట. నాకివాళే తెలిసింది. కనిపించక పోతే ఊళ్ళో లేడేమో అనుకున్నాను. పదిరోజులైందిట' అంటూ నాన్న లోప లికి వెళ్ళిపోయారు. మ్రాన్పడి విల్చుండి పోయాను. ముఖాముఖీ మాట్లాడి ఎఱుగని అతనిమీద నాకెందుకంత ఆకర్షణో మరి! ఆ రోజంతా అన్యమనస్కంగానే తిరిగాను.

పరీక్షలైనాయి. దసరా శెలవు లిచ్చారు. కాదంబరితో మద్రాసు వెళ్ళి వస్తూ బెజవాడలో దిగాను. సుందరత్త య్యను చూడటానికి. చిన్నప్పటినుంచీ ఆవిడంటే నాకెంతో ప్రేమ. మామయ్య పోవటంతో – అత్తవారింటినుంచి వచ్చిన పదిహేనువేల రూపాయలతో, నాన్న పసుపూ – కుంకం క్రింద యిచ్చిన ఐదెకరాల మాగాణీమీద వచ్చే అదా యంతో అక్కడే ఒంటరిగావుంటున్నది.

అత్తయ్యంటే నాకెంతో జాలికూడా రాధా ! ఏమీ తెలియని వయసులో తాతయ్యావాళ్ళు ఆవిడకు పెళ్ళి చేశారు కాపరానికి వెళ్ళి సంవత్సరం తిరక్క ముందే, తన పన్నెండవఏట వైధవ్యం అనుభవించవలసివచ్చింది. అప్పటికి అత్తయ్య గర్భవతి. నాన్న తనతో తీసుకువచ్చి, కాన్పు అయేదాకా కంటికి రెప్పలాగా కాచుకున్నారు. కూతురు పుట్టింది.

నాన్న అత్తయ్యకు రెండోపెళ్ళి చెయ్యాలని పట్టుపట్టి సంబంధాలను వెత కటం మొదలుపెట్టాడు. మొగవాడికి




ఎంతమంది పెళ్ళాలున్నా సహించగలిగే సంఘం ఆడదానికి రెండో పెళ్ళి అంటే సహించలేకపోయేది కొడుకు చనిపోతే కోడలు జుట్టు తీయించుకోలేదని మండిపడిపోతున్న అత్తగారు ఈ విషయం వినటంతోనే తోక త్రొక్కిన త్రాచయి, కోడలికీ తమకూ సంబంధం లేదని, బాంధవ్యం తెంచుకుని పాలు తాగే పిల్లను వేలు వేసి తీసుకు వెళ్ళిపోయారు. తర్వాత కొద్దిరోజులకే నాన్న స్నేహితుడు ఒకాయన అత్తయ్యను చేసుకోవటానికి యిష్టపడడంతో — అత్తయ్య పెళ్ళి జరిగిపోయింది.

ఆ మామయ్యతోనే నాకు కొద్దిగా పరిచయం. పచ్చగా, బొద్దుగా, బుంగ మీసాలతో హుందాగా తిరుగుతూండే మామయ్యంటే నాకెంతో యిష్టం. పదేళ్ళ క్రితం ఓ రోజు ఉన్నట్టుండి మామయ్య కన్ను మూశాడు అత్తయ్య జీవితంలో మరో అధ్యాయంలో మళ్ళీ విషాదం తొంగిచూసింది. ఆ రోజు నాకింకా జ్ఞాపకమే.

అందరూ శవంచుట్టూ చేరి ఏడుస్తున్నారు అత్తయ్య కంట్లో తడి అయినా లేదు. కళ్ళార్పకుండా ఎదురుగా వెలుగుతున్న జ్యోతివంక చూస్తూ కూర్చుంది శవాన్ని తీసుకు వెళ్ళేటప్పుడు మాత్రం అత్తయ్యకు ఒంటిమీద స్పృహలేదు. అంతేకానీ నోరువిప్పి ఒక్కమాట ఆడలేదు. వెక్కిళ్ళుపెట్టి ఏడ్చి గొడవచెయ్యలేదు ఏదైనా అంతే! ఆ మనోధైర్యమే నాకెంతో యిష్టం

మామయ్యకు తల్లి ఒక్కతే. తండ్రి

లేదు. ఒక్కగా నొక్క కొడుకు పోవటంతో ఆవిడ కాశీకి వెళ్ళిపోయింది.

అత్తయ్య మాత్రం అక్కడినుంచి కదలనని భీష్మించు క్కూర్చుంది. నాన్న బ్రతిమాలారు. ససేమిరా అంటే, చేసేది లేక నాన్న హైదరాబాదు వచ్చేశారు. అప్పుడప్పుడు వచ్చి చూసి వెళ్తుండేది.

పెద్దన్నయ్య పెళ్ళిలో చిన్న మామయ్య అత్తగారు ఏదో అన్నదని అప్పటినుంచీ బంధువుల యిళ్ళకు రాకపోకలు తగ్గించేసింది. చిన్నప్పటినుంచీ— నాన్నకూ అత్తయ్యకూ మధ్య ఆప్యాయత ఎక్కువ. నాన్న ఒక్కడే తనకు మిగిలివున్నా డనుకుంటుంది. అందుకే మాయింటికితప్ప యింకెక్కడికీ రాదు. శుభకార్యాల్లో పాల్గోదు.

జీవితంలో ఎదురుదెబ్బల నెదుర్కొంటూ సుఖంకన్నా దుఃఖాన్ని ఎక్కువ భరించి, తన లోపం ఏమిటా అని వెనక్కితిరిగి చూసి తర్కించి తెలుసుకునే అవకాశం అయినా లేకుండా జీవితపు పరిధిలోని అగాధాల్లో కాలుజారి రాలిపోయిన అత్తయ్య, పైకిలేచి తిరిగి కోలుకోలేనంతగా మారిపోయిన అత్తయ్య అంటే నా కెంత ప్రేమో అంత జాలి. ఆత్మీయతే తప్ప, ఆవేదనే తప్ప, ఏకోశానా ద్వేషం – సుఖం అన్నవి తెలియని సుందరత్తయ్య అంటే నా కెంతో యిష్టం. అందుకే పనిక్కట్టుకని బెజవాడ వెళ్ళాను. అత్తయ్యను చూడాలని.

రిక్షా దిగి గుమ్మంలో నిలబడ్డ నన్ను చూడగానే అత్తయ్య ఆశ్చర్యపోయింది. 'ఏమిటే ఉత్తరం అయినా రాయకుండా వచ్చావు?' అంది ఆశ్చర్యంగా.

'హఠాత్తుగా వచ్చి నిన్ను సంతోషంలో ముంచేద్దామని' అన్నాను నవ్వి.

'బానే వుంది. స్టేషను కెవర్నయినా పంపివుండేదాన్నిగా. అంతదూరంనుంచి ఒక్కదానివే వచ్చావు' అంది.

'స్టేషనుదాకా వచ్చినదాన్ని, స్టేషను నుంచి యింటికి రాలేనా?' అన్నాను.


'సరేలే! స్నానం చేసిరా ముందు.' అంది లోపలికి వెళ్తూ.

వేడినీళ్ళు పోసుకుని అలసట తీర్చుకుని అత్తయ్య పక్కన కూర్చుని కబుర్లు చెప్తుండగానే చీకటి పడింది. భోజనం చేసి – పడుకున్నాను. బడలికగా వుందేమో, వెంటనే నిద్ర పట్టేసింది.

వెచ్చగా సూర్యకిరణాలు తాకేసరికి మెలకువవచ్చింది. కిటికీలోంచి ఎండ మీదపడుతోంది. టైమ్‌పీసు చూశాను. 'అమ్మ బాబోయ్ అప్పుడే తొమ్మిది!' గాభరాగా లేచాను. తలుపు తీసుకుని బైటికి రాగానే ఎవరిదో కొత్తగొంతు వినిపించింది.

'బంధువులు వచ్చినట్టున్నారే పిన్నీ!'

'అవునుబాబూ! మా అన్నయ్య కూతురు'



'ఎవరో' అనుకుంటూ త్వరత్వరగా ముఖం కడుక్కుని టవల్‌తో తుడుచుకుంటూ వంటింట్లోకి వచ్చాను.

'లేచావా ?' అంటూ ఫ్లాస్కులో కాఫీ కప్పులోకి వంచుతున్న అత్తయ్య— అతన్ని చూస్తూ నిలబడ్డ నన్ను చూసి ఆశ్చర్యపోయింది.

కృష్ణ ! ఇక్కడి కెలా వచ్చాడు ? అత్తయ్య కెలా తెలుసు ? పరిపరివిధాల పోతున్నాయి నా ఆలోచనలు. వెంట్రుకల మధ్యనుండి నుదిటిమీద గాయం తాలూకు ప్లాస్టర్ కనిపిస్తోంది.

'మీరా ; నమస్తే !' ఆశ్చర్యంనుంచి తేరుకుని నమస్కారం చేశాడు.

'మా నీలి నీకు తెలుసా మోహన్ ?' విస్మయంగా అడిగింది అత్తయ్య.

'తెలుసు పిన్నీ ! నా రూముదగ్గరే వీళ్ళిల్లు. పి న్నమ్మగారు రోజూ కోవెలకు వస్తుంటారు. అది సరేకానీ నువ్వెప్పుడూ హైదరాబాదులో మీ బంధువు లున్నట్టు చెప్పలేదేం ?' కొంచెం నిష్ఠురంగా అడిగాడు.

'చెప్పాననుకుని మర్చిపోయానేమో?' అంది అత్తయ్య.

'ఎలావుంది మీ కిప్పుడు ? కాఫీ కప్పు అందుకుంటూ అడిగాను.

'ఫర్వాలేదు; పరీక్షలు బాగా రాశారా?' ప్రశ్నించాడు. తల వూపాను.

మోహనకృష్ణ వెళ్ళిపోయిం తర్వాత చెప్పింది అత్తయ్య.

అంత పెద్దయింట్లో ఒక్కతీ వుండలేక మూడుగదులు అద్దె కిచ్చిందిట. అందులోకి కృష్ణ, అమ్మ — నాన్నగారు వచ్చార్ట ఎనిమిదేళ్ళక్రితం. అప్పటి కతను ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాట్ట పెద్దగా వున్న సంసారం కాదు

వాళ్ళది. కృష్ణ నాన్నగారి సంపాదనమీదే ఆధారపడ్డారు వాళ్ళు. అడపాదడపా అత్తయ్య ఆదుకునేది. కృష్ణ ఎమ్మెస్సీలో వుండగా తండ్రి కాలంచెందాడు. పరీక్షలముందు చదువు ఆపటం ఎందుకని అత్తయ్య డబ్బు సహాయంచేసి ఎమ్మెస్సీ పూర్తిచేయించింది. ఎన్నిఏళ్ళ పరిచయం వాళ్ళిద్దరిమధ్యా విడిచిపోలేని అనుబంధాన్ని సృష్టించింది. నేనక్కడ వున్న కొద్దిరోజుల్లోనే అత్తయ్యంటే కృష్ణ కున్న అచంచల గౌరవాన్నీ — అనన్య అనురాగాన్నీ గ్రహించాను. హైద్రాబాదులో కృష్ణకు యాక్సిడెంటు అయిందని తెలిసి అత్తయ్య మనిషిని పంపించింది. కొద్దిగా కోలుకున్నాక బెజవాడ తీసుకు రమ్మని.


'జీవితంలో అపూర్వమైన అనుబంధాలు, అపూర్వంగానే జరుగుతూంటాయి. అలాంటి వాటిల్లో పిన్నితో పరిచయం, ఆవిడ ప్రేమా ఒకటండీ' అన్నాడు మోహనకృష్ణ దుర్గగుడికి వస్తూ నాతో. ఆరోజున చాలా విషయాలు చెప్పాడు. కృష్ణతల్లి అన్నపూర్ణమ్మ అత్తయ్యకు తోడుగా ఆ యింట్లోనే వుంటూంది. మోహన్ నెలనెలా డబ్బు పంపుతుంటాడు

కొండమీద కూర్చుని, దీపాల వజ్రాలహారపు కాంతిలో ధగధగా మెరిసిపోతున్న విజయవాడ అందం చూస్తూ — అతని మాటలు వింటుంటే నా కానా దేవో అపూర్వ అనుభూతి — జీవితం అందరికీ పూలబాట కాదుకాబోలు అనిపించింది. లేకపోతే నా కేనాడైనా ఫీజు కట్టలేకపోవటం, మంచిబట్టలు లేవని స్కూలుకు వెళ్ళకుండా వుండటం లాంటివి తెలుసునా ?

ఆక్షణానే అత్తయ్యంటే మరింత గౌరవం, మోహనకృష్ణ అంటే మహత్తర ఆకర్షణా నా మనసులో ప్రవేశించాయి. ఎన్నడూ ఏ విషయాన్ని గురించీ ఆలోచించే స్వభావంలేని నాలో చైతన్యాన్ని కలిగించి, మనసూ — శరీరం కూడా అలసిపోయేలా చేశాడు కృష్ణ. అలా మనసు విప్పి అన్నీ చెప్తుంటే, మధ్యమధ్య చెమర్చిన అతని కళ్ళను తుడవాలనీ, 'నే నున్నాను. నువ్వధైర్య పడకు కృష్ణా,' అని గుండెలకు హత్తుకుని చెప్పాలనీ అనిపించింది.

తర్వాత నా ఊహకు నవ్వుకున్నా — రోజు రోజుకూ దానికి జీవం పోస్తోంది నా మనసని గ్రహించుకున్నాను.

దాదాపు పదిగంటల ప్రాంతాన బెజవాడ అంతా తిరిగి యింటికి చేరుకున్నా మిద్దరం దుస్తులు మార్చుకుని, గబగబా వంటింటివైపు అడుగులు వేయబోయిన నన్ను భుజం పట్టుకుని ఆపాడు కృష్ణ. వెనక్కుతిరిగి చూశాను. మాటాడవద్దన్నట్టుగా సంజ్ఞ చేసి వంటింటివైపు తిరిగాడు. నేనూ అటూ చూశాను. లోపలికి చూసిన



తర్వాత నాకంతా అయోమయంగా అనిపించింది. అత్తయ్య ఏడుస్తున్నది. నా పదిహేడేళ్ళ జీవితంలో అదే మొదలు, అత్తయ్య కంటతడి చూడటం. ఒళ్లోని పట్టుచీరతో మృదువుగా కళ్ళను స్పృశిస్తూ కన్నీరు కారుస్తోంది అత్తయ్య. కృష్ణ తల్లి అత్తయ్యను ఓదారుస్తున్నది

'ఊరుకో సుందరమ్మా. బాధపడకు. వాళ్ళకు మనసులో లేని ఆప్యాయతలు మనం ప్రాకులాడినా రావు. గతం కిమ్మిన్నాస్తి అనుకోవాలి. అమ్మాయి వస్తుందేమో! లేచి ముఖం కడుక్కోరా!'

అన్నపూర్ణమ్మ మాటలు నాకర్థం కాలేదు. కృష్ణవంక చూశాను. అతని కళ్ళనిండా నీరు. 'ఏమిటది' అన్నాను మెల్లిగా.

కళ్ళు తుడుచుకుని ఇంటిముందర వున్న వేపచెట్టు క్రిందికి దారి తీశాడు మోహనకృష్ణ. ఇద్దరం తిన్నెమీద కూర్చున్నాం. అను చెప్పిందంతా విన్నాక తేరుకోలేనంతగా ఆశ్చర్యపోయాను.

అన్నపూర్ణమ్మ తమ్ముడికి బావుంటం లేదంటే చూసొద్దామని నిన్న గుంటూరు వెళ్ళింది. వాళ్ళింటి ప్రక్కనే అత్తయ్య కూతురు యిల్లట; క్రొత్తగా పెళ్ళిఅయి, అత్తవారింటికి వచ్చి మూడునెలలైందిట. అత్తయ్యకా సంగతి తెలిసి మమకారం చంపుకోలేక అన్నపూర్ణమ్మతో పసుపు–కుంకం, చీర, పూలు పంపించిందిట. కానీ సరళ అది తీసుకోలేదుట.

'నాకు అమ్మ లేదు. బామ్మే నాకు అమ్మ. ఆవిడ తప్ప నాకింకెవరూ లేరు అక్కర్లేదుకూడా నన్ను కాదని ఏనాడు తన

వ్వసుఖం చూసుకుని – తల్లిపాలు త్రాగే అదృష్టం నాకు లేకుండా చేసిందో, అనాడే మా అమ్మ చచ్చిపోయింది. ఇన్నాళ్ళ తర్వాత ఈ మమకారం నా కక్కర్లేదు. తీసుకెళ్ళండి ఇంకెప్పుడూ అమె ఊసు నాదగ్గిర తేకండి' అంటూ నిష్కర్షగా చెప్పి తిప్పి పంపేసింది.

తెంచుకోలేని రక్త సంబంధం తమిద్దరి మధ్యా వున్నా కూడా, కన్నకూతురికి చిటికెడు కుంకం పంపలేని అత్తయ్యది ఏం బ్రతుకు? పదమూడేళ్ళ ప్రాయాన మంచి చెడ్డల విమర్శన చేసే శక్తిలేని వయస్సులో అత్తయ్య చేసిన పని పదహేనేళ్ళ తిర్వాత అమెగుండెల్లో శూలంలా దిగబడింది. భర్తను – పిల్లనీ కూడా దూరం చేసుకుని ఏకాకిగా మిగిలిపోయిన అత్తయ్యను తల్చుకుంటే నా గుండె పగిలిపోతుంది. అలా ఎంత సేపు కూర్చున్నామో యిద్దరం.

మోహనకృష్ణ లేచి 'యింట్లోకి వెళ్దాం రండి' అన్నాడు. కళ్ళు తుడుచుకుని లోపలికి వచ్చాను. హాలులోనే అత్తయ్య ఎదురైంది.

'ఇంత ప్రొద్దు పోయేదాకా ఏం చేస్తున్నార్రా?' అంది నవ్వుతూ. అంత క్రితం ఆవిడ అనుభవించిన బాధ తాలూకు చిహ్నాలే లేవు ఆ వదనాన. ఇద్దరికీ అన్నం పెట్టి మామూలుగానే కబుర్లు చెప్పింది.

కృష్ణ పడుకోటానికి వెళ్తూ 'మీకీ సంగతి తెలిసినట్టు పిన్నికి తెలియనీయకండి; బాధపడుతుంది' అన్నాడు. సరేనని తలవూపాను. తర్వాత రెండు రోజులకే హైద్రాబాదు వచ్చేశాను. కృష్ణకూడా నాతోనే వచ్చాడు. అప్పటి నుంచీ మా యిద్దరి మధ్యా స్నేహం పెరిగింది. మా యింటికీ – అతనింటికీ రాకపోకలు ఎక్కువైనాయి. నాన్న కూడా చాలా ఆత్మీయంగా చూసేవారు కృష్ణను. పద్మజకు ట్యూషన్ చెప్పేవాడు. మాతో సినిమాకు, షికార్లకు, పిక్నిక్కు, ఒకటేమిటి – ఇంట్లోంచి బయటకు అడుగుపెడితే అతనూ రావల్సిందే మా కుటుంబంలో ఒకవ్యక్తిగా కల్సిపోయాడు. తరుచు కోవెలకు వెళ్తుండేవాళ్ళం. కోనేటిగట్టున వీళ్ళ గన్నేరు చెట్లకు దగ్గరగా కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పుకునేవాళ్ళం; కాని ఏనాడూ పొరపాటుగానైనా పొల్లుమాట అనలేదు. ఏకాంచన ప్రాయోగం కూడా చెయ్యని కృష్ణ అంటే నాకు వల్లమాలిన యిష్టం – గౌరవం. బహుశ అయన్ని తలచుకుని జాలిపడేదాన్నేమో?

ఆ సంవత్సరమే కృష్ణకు రిసెర్చి స్కాలర్‌షిప్పు వచ్చి పూనా వెళ్ళిపోయాడు. మా మధ్య పరామర్శలు. కుశల ప్రశ్నల్లాంటి వుత్తరాలు నడిచాయి. ఏదో కబురువస్తుందనీ, ఏదో అందిస్తుందనీ ప్రతి ఉత్తరంలో వెతు



క్కునేదాన్ని. ఏమీ ఉండదు. ఒకోసారి నా కనుమానం వేసేది-నే నూహించుకున్నవేమీ అతనిలో లేవేమోనని. కానీ కృష్ణమాటలు, నా స్నేహంకోసం, సానుభూతికోసం తహతహలాడుతున్నట్లుంటే, అతని కళ్ళు నన్ను పూర్తిగా పిచ్చిదాన్నిచేసి ప్రక్కదారికి మళ్ళించినాయి.

ఫైనల్ యియర్‌లో వుండగా నాన్న నాకు సంబంధాలు చూడటం మొదలు పెట్టారు. తెగించి చెప్దామని ఎన్నో సార్లు ప్రయత్నించాను. కానీ నాకు నోరు రాలేదు. ముఖ్యంగా కృష్ణ అభిప్రాయం తెలియదు నాకు. ఇలాంటి తర్జన భర్జనలతో వచ్చిన నాలుగైదు సంబంధాలు త్రిప్పికొట్టాను. నా పరీక్షలై పోయేసరికి మోహన్ రిసెర్చి అయిపోయి వస్తాడు. ముఖాముఖీ ఏదో ఒకటి తేల్చుకుందా మనుకున్నాను. చదువు వంకతో నిశ్చింతగా ఫైనల్ ఇయర్ గడిపేశాను. పరీక్షలైపోయాయి.


ఆ రోజు రాత్రి భోజనా లైనాక, ఏం తోచక నాన్నడ్రాయరులో ఏదయినా పుస్తకం వుందేమో నని తెరిచాను. అత్తయ్య వ్రాతతో ఒక కవరు కనిపించింది. తెరిచి చూచాను. నా ఆశా సౌధాన్ని పునాదులతో సహా పెళ్ళగించి వేసిం దా వుత్తరం. అనాడే తెలిసింది, ఆడదాని జీవితానికి ప్రేమపునాదులు ఎంత పటిష్ఠంగా నిలిచివుంటాయో ?

'నువ్వు రాసిన వుత్తరం చేరింది. ఉభయ కుశలోపరి. చి॥ నీలను మోహన కృష్ణకు యిచ్చి పెళ్ళి చేసే ఉద్దేశ్యం నాకు చాలా నచ్చింది. అన్న పూర్ణతో సంప్రదించి ఆవిడ అంగీకారంతో బాబుకు ఉత్తరం రాశాను నిన్ననే. మోహను నుంచి జాబువచ్చింది. మనం ఊహించినదానికి వ్యతిరేకంగా వున్నందుకు నే నెంతో విచారిస్తున్నాను. మోహను కా ఉద్దేశ్యమే లేదట: నీలను ఆ అభిప్రాయంతో అత నెన్నడూ చూడలేదట.'

ఇదీ అత్తయ్య ఉత్తరంలో సారాంశం.

ఆరాత్రి నా దురదృష్టాన్ని తల్చుకుని కుమిలి కుమిలి ఏడిచాను. కృష్ణ నన్ను మోసం చేశాడని బాధ పడ్డాను.

కానీ ఆ క్షణాన అతనంటే ఎంత ద్వేషించినా, క్రమంగా నా తప్పు నాకే తెలిసింది. నిజంగా ఏనాడూ త నా ఊహకు స్థానమివ్వలేదు. కృష్ణ మనసులో నిజంగా ఆ అభిప్రాయం వుంటే పన్నెండు నెలలు కబుర్లతో కాలం గడిపేవాడేనా ? మాట మాత్రంగానైనా తన అనురాగం తెలిపి వుండేవాడుకాదూ ? నాలో నేను కుమిలి పోతూ మూడునెలలు గడిపాను. రిజల్ట్సు వచ్చాయి, క్లాసు వచ్చింది. ఎమ్మే చదువు తావా అన్నారు నాన్న. జీవితంలో నే



'నిజంగా మనసులో ప్రేమ వుంటే ఈ వ్యాధి అడ్డంవస్తుందా ? ఆపరేషను అయి నాక ఫర్వాలేదని డాక్టరు చెప్పాడుగా అంటే – ఒద్దు ప్రభూ ! ఆ అమ్మాయి ఏనాడూ మనసు విప్పి నాతో చెప్పలేదు. నువ్వు లేకపోతే బ్రతకలేనని అనలేదు. అలాంటప్పుడు ఈ స్థితిలో నా కోరిక చెపితే స్వార్ధపరుకి ననుకోమా ! నామీద వున్న గౌరవంకూడా పోతుంది. తనను సుఖపడనీ. ఇదంతా చెప్పి తనమనసు

చెదరగొట్టటం నా కిష్టంలేదు — అని నా కెదురుగానే ఉత్తరం రాసిపడేశాడు. వాడి స్థితి చూస్తే నా కేడుపు వచ్చేది. ఏమైనా వాడు బ్రతకనేర్చినవాడు కాదు. చేజేతులా బ్రతుకు పాడు చేసుకున్నా డేమో అనిపిస్తుంది.' అంటూ వారు చెయ్యికడుక్కోటానికి లేచివెళ్ళారు

రెండు క్షణాలు అయినాక నా స్థితి గ్రహించి "నీలా" అన్నారు నాన్న భుజం తట్టి.


ఉప్పెనగా పైకి రాబోయిన దుఃఖం వారినిచూసి ఆగిపోయింది. కళ్ళు తుడుచు కుంటున్న నన్ను చూసి వారదోలా నవ్వారు. "నీలు మనసు నవనీతం మామ గారూ! చిన్నవిషయాలకే ఎలా కంది పోతుందో చూడండి" అన్నారు నా కురులు దువ్వుతూ.

పెద్దగా నవ్వాలనిపించింది. బావురుమని ఏడద్దామనిపించింది. కాని ఏదీచెయ్యలేక పోయాను. నా కధికారం లేనప్పుడు నా బాధ నాలోనే అణచుకున్నాను. సమయం దొరికినప్పుడు తనివితీరా ఏడిచాను.

కానీ, నిజంగా వారన్నట్టు కృష్ణ చేజేతులా జీవితం పాడుచేసుకున్నా డేమో! ఒక్కనాడైనా 'నీలీ! నవ్వంటే నా కిష్టం' అనివుంటే సంతోషంగా నా బ్రతుకు సర్వితం చేసివుండేదాన్ని. ఏ ఒక్క మాటకోసం మూడేళ్ళు ఎదురు తెన్నులు చూశానో అమాటే నే నసహే దని కృష్ణ భ్రమపడ్డాడు. నా కళ్ళు చూడ గలిగితే. నా హృదయాన్ని చదవగలి గితే తను అలా అనేవాడేనా? అతని ప్రేమలో ఏ కొంచెం నాకు తెలిసినా ఈ వ్యాధి మా యిద్దరిమధ్యా యిలా అడ్డు గోడ కట్ట గలిగేదేనా? మగవాడు — తనకే లేనిధైర్యం నా కెలా వస్తుంది?

ఇవ్వాళ తనంటే నాకు ప్రేమ లేదు కానీ అప్పటికీ, యిప్పటికీ జాలి — గౌరవం మిగిలేవున్నాయి. ఇవాళ తను లేకపోవచ్చు. కానీ తన రూపం మా యిద్దరి మనసులనుంచీ చెరిగిపోలేదు ప్రభు కన్యాయం చేస్తున్నానని నే నెప్పుడూ అనుకోను. ఎందుకంటే కృష్ణని నిజంగా ప్రేమించలేదని నా కిప్పుడే తెలిసివస్తోంది. అనేక భ్రమ పాలపొంగులాంటి యవ్వనంలో వయసు నాలో పొకించి, మత్తు కలి గించిన ఊహ — అంతే.

ఇదంతా తెలిసినాక కూడా 'అయ్యో, కృష్ణతో నేనైనా మనసువిప్పి చెప్పాను కాదే — తనను చేసుకోనైతినే' అనే బంధనంలో తగలకపోవటమే నాది ప్రేమ కాదని తేటతెల్లం చేస్తోంది. కాని ఒక్కటేదిగులు — అదల్లా మోహన కృష్ణ జీవితాన్ని అనుభవించలేక పోయాడే అని పుట్టినప్పటినుంచీ సంతో




షాన్ని — తృప్తినీ అన్వేషిస్తూనే వున్నాడు. అతని నిరీక్షణ ఫలించే రోజుల్లో తీవ్రంగా గాయపడి — తనలో చైతన్యాన్ని, సంతోషాన్ని పోగొట్టుకొన్నాడు. చివరికి తనే కాలంలో కలిసిపోయాడు.

రాధీ! కృష్ణను నా జ్ఞాపకాల తెరల క్రింద వుంచేయాలని ప్రయత్నిస్తున్నాను. అది యివ్వాళ కాకపోతే రేపైనా చలించకమానదు. 'నువ్వు నిర్దయురాలివి నీవీ' అని నన్ను నిందించినా నే నంగీకరిస్తాను కానీ, యింకా తనను గుర్తుంచుకుని — నేనే ఆ అమ్మాయి నని తనతో చెప్పి నా జీవితాన్ని కూడా పాడుచేసుకోలేను. కృష్ణ ఆత్మకు కనీసం దైవం అయినా శాంతి ప్రసాదిస్తాడని ఆశిస్తూ — ముగిస్తున్నాను — నీ

"నీలిమ"